

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 23.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.23 (ఆది)
సహారి : 4.44(సోమ)



టిడ్కో గృహాల వద్ద నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల

టిడ్కో గృహాలను పూర్తిచేస్తాం

- జూన్ చివరి నాటికి గృహ ప్రవేశాలు చేయిస్తాం
- మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

పాలకొల్లు టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ హయాంలో 90 శాతం పూర్తయిన ఎన్టీఆర్ టిడ్కో గృహాలను నూరు శాతం పూర్తిచేయడమే లక్ష్యమని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం పాలకొల్లు పట్టణంలోని టిడ్కో గృహాల వద్ద నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 8 లక్షల ఇళ్లు, పాలకొల్లులో 6.130 ఇళ్లు 90 శాతం పూర్తయినా మిగిలిన పది శాతం పనులు పూర్తి చేయలేక పోయారని వైసీపీ ప్రభుత్వాన్ని విమర్శించారు. ఆర్భాటం కోసం గత వైసీపీ పాలనలో రంగులు మాత్రం వేయించారన్నారు. టిడ్కో గృహాల లబ్ధిదారులందరికీ ఈ ఏడాది జూన్ చివరి నాటికి గృహాలను అందించి, గృహ ప్రవేశాలు చేయి స్తామన్నారు. ఒక్కొక్క ఇంటిని రూ.3.60 లక్షలు చొప్పున గత ప్రభుత్వం తాకట్టు పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇళ్లపై రూ.5 వేల కోట్లు తీసుకుందన్నారు. ఆ నిధు లు పక్కదారి మళ్లించారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, మున్సిపల్ కమిషనర్ బి.విజయసారధి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

రోడ్లపై చెత్త వేయకూడదు : కలెక్టర్

భీమవరటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర లక్ష్యసాధనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, జిల్లాలో ఎక్కడా రోడ్లపై చెత్త వేయకూడదని, ప్లాస్టిక్ వస్తువులను వినియోగించకూడదని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి మునిసిపల్ కమిషనర్లు, మార్కెటింగ్ శాఖ ఏడీతో గూగుల్ మీట్ ద్వారా ఆమె సమీక్షించారు. జిల్లాలో దేవాలయాల వద్ద పువ్వులు, పండ్లు, ఇతర వ్యర్థ పదార్థాలు వంటి వేస్టేజీ ఎక్కువగా ఉంటుందని దానిని రీసైక్లింగ్ చేసుకునే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కూరగాయలు మార్కెట్లు, హోటల్స్ షాపింగ్ కాంప్లెక్స్‌లు, రెసిడెన్సీలు హాస్పటల్స్ వద్ద వచ్చే వ్యర్థ పదార్థాలను స్థానికంగానే కంపోస్ట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 15న తణుకు పట్టణంలో సీఎం పర్యటించినప్పుడు ఐక్యనగర్‌లో హౌసింగ్ కాలనీలో ఉన్న పార్కును రూ.30 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు దేవి సీఫుడ్స్ లిమిటెడ్ ముందుకు వచ్చిందన్నారు. పార్కులను అభివృద్ధి చేస్తే స్థానికులు నిర్వహణ చేసుకుంటారన్నారు. డీఆర్‌వో మొగిలి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


ఏప్రిల్ 30న ఏపీ పాలిసెట్

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు, నరసాపురం, పట్టణాల్లో పాలిసెట్-2025 పరీక్షలు ఏప్రిల్ 30న నిర్వహిస్తామని జిల్లా సమన్వయకర్త డి.ఫణీంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పదో తరగతి పాసైన విద్యార్థులు పాలిసెట్‌కు అర్హులని వివరించారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలి

- ఏప్రిల్ మొదటి వారంలో కేంద్రాలను ప్రారంభించాలి
- జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి ఆదేశం

భీమవరం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రబీ ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం కావాలని, ఏప్రిల్ మొదటి వారంలో కేంద్రాలను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో రబీ సాగుకు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లు, పీజీఆర్ఎస్, రీసర్వే, రెవెన్యూ సదస్సులు, వెబ్ ల్యాండ్, ఏపీ సేవా సర్వీసులు తదితర అంశాలపై గూగుల్ మీట్ ద్వారా ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రబీ సాగుకు సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ మొదటి వారానికి ప్రారంభించాలన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలో ధాన్యం కొనుగోలు ప్రకియకు సంబంధించి సిబ్బంది నియామకం చేసి వారికి పూర్తిస్థాయిలో మూడు విడతలుగా శిక్షణను ఇవ్వాలని సూచించారు. గోనె సంచులు నిల్వ చేయడానికి గోదాములు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రవాణా సౌకర్యానికి వాహనాలు పూర్తిస్థాయిలో సిద్ధం చేసి జీపీఎస్ అమర్చాలన్నారు. డీఆర్‌వో మొగిలి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్స్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, డీఎస్‌వో ఎన్.సరోజ, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, జిల్లా, గ్రామ, వార్డు సచివాలయాల అధికారి వై.దోసి రెడ్డి, డీటీ ఎం.సన్యాసిరావు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌తో సమస్యలు పరిష్కారం

- వినియోగంలోకి ఆకివీడు బస్టాండ్
- ఉంగుటూరు, తణుకు బైపాస్‌లో ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల
- ఆర్టీసీ ఆర్ఎం వరప్రసాద్ వెల్లడి

భీమవరం టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌లో ఈ నెల 12న ప్రయాణికులు లేవనెత్తిన పలు సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఆర్ఎం ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ 'చింతలపూడికి చెందిన తొర్లపాటి బాబూరావు కోరిన విధంగా చింతలపూడి నుంచి విజయవాడకు ప్రత్యేక బస్సును శనివారం ప్రారంభించాం. ఉంగుటూరులో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నిలుపుదల చేయాలని స్థానికుడు వంశీకృష్ణ అడిగిన విధంగా శనివారం నుంచి బస్సులు నిలుపుదల చేస్తున్నాం. ఏలూరు నుంచి మురళి, వెంకటేశ్వరరావు చేసిన ఫిర్యాదు మేరకు అధ్వానంగా వున్న ఏలూరు-విజయవాడ నాన్‌స్టాప్ బస్సులను మార్పు చేయించాం. జంగారెడ్డిగూడెంలో డ్రైవర్‌పై వచ్చిన ఫిర్యాదుపై సమస్యను పరిష్కరించాం. ఆకివీడు వైస్ చైర్మన్ పుప్పాల సత్యనారాయణ ఫిర్యాదు మేరకు స్థానిక బస్టాండ్ వినియోగానికి చర్యలు తీసుకునేలా భీమవరం అసిస్టెంట్ డిపో మేనేజర్ సురేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పూర్తిస్థాయి వినియోగానికి చర్యలు తీసుకుని, బస్సులన్నీ అక్కడకు వచ్చేలా ఆదేశాలు జారీ చేశాం. తణుకు బైపాస్ రోడ్డులోని షర్మిష్ట రెస్టారెంట్ వద్ద బస్సులు ఆగేలా చర్యలు తీసుకున్నాం. తణుకు డిపోకు చెందిన హైదరాబాద్, తిరుపతి బస్సులు పట్టణంలోకి వెళ్లి బైపాస్ రోడ్డులోని షర్మిష్ట వద్ద ఆగేలా చర్యలు తీసుకున్నారు. ఇతర జిల్లాల బస్సులు ఆపేలా సంబంధిత జిల్లాల అధికారులకు సమాచారం ఇస్తాం' అని ఆర్ఎం వివరించారు.

చింతలపూడి - విజయవాడ బస్సు ప్రారంభం



నూతన బస్సు సర్వీసును జెండా ఊపి ప్రారంభిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్

నూతన బస్సు సర్వీసు ప్రారంభం

జంగారెడ్డిగూడెం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం నుంచి చింతలపూడి, నూజివీడు మీదుగా విజయవాడ వెళ్లే సూపర్ డీలక్స్ బస్సును ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శనివారం ప్రారంభించారు. చింతలపూడి వరకు టీడీపీ నాయకులతో పాటు ఎమ్మెల్యే బస్ టిక్కెట్‌లు కొని ప్రయాణించారు. 'జంగారెడ్డిగూడెం నుంచి నూజివీడు, చింతలపూడి నుంచి విజయవాడ వెళ్లే ప్రయాణికులకు ఈ బస్సు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రతీ రోజు ఉదయం 5.30 గంటలకు జంగారెడ్డి గూడెం నుంచి బయలుదేరి పది గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరిగి సాయంత్రం ఐదు గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి పది గంటలకు వస్తుందని డీఎం గంగాధరరావు తెలిపారు.

ప్రత్యామ్నాయ రోడ్లతోనే సమస్యలకు చెక్



ఇరుకుగా ఉన్న డీఎల్‌కే రోడ్డు

తణుకు పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు

- ప్రధానంగా రాష్ట్రపతి రోడ్డుపైనే కొనసాగిస్తున్న రాకపోకలు
- ప్రత్యామ్నాయ రోడ్ల అభివృద్ధితోనే ట్రాఫిక్ సమస్యల పరిష్కారం

ఇరుకు రోడ్లతో ప్రజలు, వాహనదారులకు తప్పని ఇబ్బందులు

తణుకు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తణుకు పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలంటే ప్రత్యామ్నాయ రోడ్లను అభివృద్ధి చేయడమే శరణ్యంగా కనిపిస్తుంది. పట్టణంలోని ఎక్కడకు వెళ్లాలన్నా ప్రధానంగా రాకపోకలు చేసేది రాష్ట్రపతి రోడ్డు ఒక్కటే. ఆ రోడ్డు ఉదయం, సాయంత్రం చాలా రద్దీగా ఉంటుంది. వందల సంఖ్యలో కార్లు, మోటారు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రోడ్డులో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. తణకు పరిసరల ప్రాంతాల పరిధిలో ఉన్న వారు పలు పనులపై వచ్చే వాహనాలతో పాటు స్కూళ్లు, కాలేజీలకు చెందిన బస్సుల తాకిడి ఎక్కువే. పట్టణంలో నిత్యం 80 వేల మంది విద్య, వైద్య, వ్యాపార అవసరాల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, స్త్రీ సమాజం రోడ్డు, డీఎల్‌కే రోడ్డు, పెరవలి, తాడేపల్లిగూడెం, ఇరగవరం రోడ్లతో పాటు భీమవరం జిల్లా కేంద్రానికి వెళ్లేందుకు రాష్ట్రపతి రోడ్డు మీదుగానే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఈ రోడ్డు ఒకటే కావడం వల్ల ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ఇబ్బందులు తప్పడం లేదు. 2014-19 సంవత్సరంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు విస్తరణ చేసి కాస్తంత ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.



హౌసింగ్ బోర్డు నుంచి వచ్చే కాలువ గట్టు రోడ్డు

వంతెనపైనే పార్కింగ్

పట్టణంలో సంతమార్కెట్‌కు వెళ్లే వారి వాహనాలకు పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతి ఆదివారం కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చి గోస్తనీ వంతెన మీద వాహనాలు పార్కింగ్ చేస్తుంటారు. వంతెనపై సగం స్థలం వరకు పార్కింగ్ చేయడం వల్ల మార్కెట్‌లోకి వచ్చిపోయే వారు కనీసం నడవడానికి ఇబ్బందులు తప్పడం లేదు. మునిసిపల్ అధికారులు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించే పరిస్థితి అక్కడ లేదు. చుట్టూ మార్కెట్ ఉన్న ప్రాంతం దుకాణాలతో నిండిపోయి ఉంటుంది. అటువైపు శ్మశానాలు దాటిన తర్వాత ఉన్న రోడ్డు పక్క స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసేవిధంగా చర్యలు తీసుకుంటే కొంతమేరకు తాకిడి తగ్గుతుంది.

ప్రత్యామ్నాయ మార్గాలు ఇవే

- పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు పలు ప్రాంతాలను కలుపుకుని ఉన్న రోడ్లు, కాలువ గట్లను అభివృద్ధి చేయాలి.
- ప్రధానంగా దమ్మెన్ను లంకల కోడేరు (డీఎల్‌కే) రోడ్డును అభివృద్ధి చేయాలి. దీనిని అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విశేషంగా కృషి చేస్తున్నారు. ఈ రోడ్డులో పట్టాదారులతో ఇప్పటికే పలుమార్లు మాట్లాడారు. యజమానులు సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తుంది. కేశవస్వామి గుడి పక్కన గల రోడ్డు నుంచి ఉండ్రాజవరం జంక్షన్ హైవేను కలుపును రోడ్డు విస్తరణ జరుగుతుంది. ఈమేరకు ట్రాఫిక్ సమస్య తీరుతుంది. ఈ రోడ్డు కోసం ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సీఎం చంద్రబాబునాయుడుకు తణుకు పర్యటనలో పూర్తి వివరాలు సమర్పించి నిధులు విడుదల కోరుతూ ప్రతిపాదనలు అందించారు.
- తేతలి వైజంక్షన్ నుంచి హైవే మీదుగా వచ్చే వారికి హౌసింగ్ బోర్డు కాలనీకు ఆనుకుని ఉన్న కాలువ గట్టును అభివృద్ధి చేయాలి. ఈ రెండు రోడ్లను అభివృద్ధి చేస్తే రాష్ట్రపతి రోడ్డుమీద ఒత్తిడి తగ్గుతుంది. ట్రాఫిక్ సమస్య తీరుతుంది.

డీఎల్‌కే రోడ్డు అభివృద్ధి చేయాలి



ప్రధాన రహదారికి అనుబంధంగా ఉన్న డీఎల్‌కే రోడ్డును అభివృద్ధి చేయాలి. ఇప్పటికే ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ విశేషంగా కృషి చేస్తున్నారు. సీఎంకు రోడ్డు అవసరాన్ని చెప్పి నిధులు మంజూరు చేయాలని కోరారు.
- తాతపూడి మారుతీరావు, తణుకు.

ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు



ప్రజలకు ప్రతి నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. పెరుగుతున్న వాహనాల రద్దీ కారణంగా ట్రాపిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కచ్చితంగా ఇబ్బందులు తొలగాలంటే ఇతర రోడ్లను ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేయాలి.
- గమిని రామచంద్రరావు, తణుకు.

కాలువ గట్టు అభివృద్ధి చేయాలి



హౌసింగ్ బోర్డు కాలనీకి పక్కనే ఉన్న కాలువ గట్టును అభివృద్ధి చేయాలి. దీనివల్ల ప్రజలకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. తాడేపల్లిగూడెం వైపు నుంచి వచ్చే వాహనదారులకు రాకపోకలకు అనువుగా కాలువ గట్టు అభివృద్ధితో ప్రయాణం సులువుగా ఉంటుంది.
- బొల్లెంపల్లి ప్రభాకరరావు, తణుకు.

ఇతర మార్గాలపై దృష్టి పెట్టాలి



పట్టణంలోకి ఉదయం, సాయంత్రం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.. పల్లెలు, పట్టణాల నుంచి పలు పనుల నిమిత్తం వచ్చిన వారంతా రాష్ట్రపతి రోడ్డు మీదుగా రావడం వల్ల సమస్య ఎక్కువగా ఉంది. దీని నివారణకు ఇతర రోడ్డు మార్గాలపై దృష్టి సారించి అభివృద్ధి చేయాలి
- ఒమ్మి రాంబాబు, తణుకు.

వేలిముద్రల సేకరణకు కొత్త డివైజ్‌లు

- పెన్షన్, ఇతర అవసరాల ఇబ్బందులకు ఇక చెక్
- జిల్లాకు వచ్చిన మొత్తం డివైజ్‌లు 4,851
- 570 సచివాలయాలకు 4,473 అందజేత



కొత్త సచివాలయాలకు పంపిణీ చేసిన డివైజ్

భీమవరంటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్‌లు, ఇతర సర్వేలకు సంబంధించి వేలిముద్రల సేకరణ, తదితర అంశాలకు సంబంధించి ప్రజల నుంచి తీసుకుంటున్న వేలిముద్రల విషయంలో ఇబ్బందులు వస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కొత్త డివైజ్‌లను అన్ని సచివాలయాలకు అందించింది. ముఖ్యంగా పెన్షన్‌ల పంపిణీలో చాలావరకు వృద్ధులకు వేలిముద్రలు పడకపోవడంతో పెన్షన్ అందించడంలో ఇబ్బందులు వస్తున్నాయి. చివరకు వారికి ఐరిష్ ద్వారా పెన్షలు అందిస్తున్నారు, రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు స్టార్ టెక్ కంపెనీకి చెందిన డివైజ్‌లను వినియోగించే వారు. ఈ డివైజ్ వేలిముద్రలను సేకరించడంలో అనుకున్నంత స్థాయిలో పనిచేయకపోవడంతో ఉద్యోగులు ఇబ్బంది పడాల్సి వచ్చేది. సచివాలయాల్లో ఆధార్ లింక్‌లకు, సర్టిఫికెట్లకు, ఇతర సర్వేలు చేస్తున్న సమయంలో వేలిముద్ర సేకరణలోనూ వేలిముద్రలు పడని సందర్భాలు ఉన్నాయి. ఐదేళ్లకు సంబంధించి ఫింగర్ ప్రింట్ రాని పరిస్థితి. ఈ సమస్యకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో కొత్త డివైజ్‌లను అందించింది. 'మంత్ర' అనే కంపెనీకి చెందిన ఈ డివైజ్ వేలి ముద్రలు తీసుకోవడంలో కొంత స్పీడ్‌గా ఉంటుందని దీనివల్ల గతంలో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అవుతాయని చెబుతున్నారు. వీటి పనితీరు ఎలా ఉంది అనేది వచ్చే నెలలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో తెలుస్తుందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 4,473 అందజేత

జిల్లాల్లో 570 సచివాలయాలు ఉన్నాయి. వీటి ద్వారా చేపట్టే పెన్షన్‌లు ఇతర సర్వేలుకు ఉపయోగించేందుకు 4వేల 473 మంత్ర డివైజ్‌లను అందించారు. జిల్లాకు మొత్తం 4వేల851 డివైజ్‌లు రాగా వాటిలో పంపిణీ చేయగా మిగిలిన 378 డివైజ్‌లను రిజర్వ్‌లో ఉంచారు.



పిల్ల రొయ్యదే పెత్తనం

6

తాబేళ్లు పరుగెడుతున్నాయ్

కొల్లేరు కేంద్రంగా అక్రమ రవాణా
చేపల వ్యానుల్లో సరిహద్దులు దాటేస్తున్నాయి

వెళ్లిపోదాం !

7

నిర్వాసితుల తరలింపునకు రంగం సిద్ధం

ఈ వీధి కుక్కలతో జాగ్రత్త..

శునకాలకు భయంకర చర్మవ్యాధి

ద్వారకాతిరుమలలో పెద్దసంఖ్యలో స్వైర విహారం



ద్వారకాతిరుమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మానవ జీవితంలో ఓ భాగమైన శునకాలు ఇప్పుడు ఆ మనిషి ఉనికికే ప్రమాదాన్ని తెచ్చి పెడుతున్నాయి. తీవ్రమైన చర్మ వ్యాధి బారిన పడిన ఈ వీధిశునకాలు హడలెత్తిస్తున్నాయి. డెర్మటైటిస్ అనే చర్మవ్యాధి సోకి చివరకు అవి మృత్యువాత పడుతున్నాయి. జుట్టు రాలి, ఒంటి నిండా పుండ్లు, వాటి నుంచి రక్తం కారుతూ అవి ఇప్పటికే వికృతంగా మారాయి. ఇవి దగ్గరకు వస్తున్నాయంటేనే జనాలు భయాందోళనలతో పరుగులు తీస్తున్నారు. ఇప్పటికే వీధికుక్కల ద్వారా ఈ స్కిన్ ఇన్ఫెక్షన్ కొన్ని పెంపుడు కుక్క లకు వాటినుంచి యజమానులకు కూడా ఈ వ్యాధి సోకిందని చెబుతున్నారు. దీంతో వారు చికిత్స పొంది, తమ పెంపుడు జంతువులను దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విడుస్తున్నట్లు తెలిసింది. ద్వారకాతిరుమల పరిధిలో వంద లాదిగా సంచరించే శునకాల్లో అధికశాతం కుక్కలకు ఈ చర్మవ్యాధి ఇప్పటికే సోకింది. నెలలుగా ఇవి వ్యాధి తీవ్రతతో బాధపడుతున్నా పంచాయితీ అధికారులు, పాలకులు పట్టించు కోవడం లేదు. వాటిని అటవీప్రాంతానికి తరలించి ఇతర ప్రాణులకు ఆ వ్యాధి సోక కుండా తీసుకోవాల్సిన చర్యలను వారు విస్మ రించారు. దీంతో పలుప్రాంతాల్లో ఇవి గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఇవి తిన్న ఆహారాన్ని తిన్న ఇతర శునకాలకూ ఈ ఇన్ఫెక్షన్ సోకుతోంది. పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉన్నా అటు పశువైద్యాధికారులు, ఇటు పంచాయతీ, ప్రజాప్రతినిధులు ఎవరూ దృష్టి సారించక పోవడం ఆందోళనకరం. ద్వారకాతిరుమల ప్రాంతంలో దాదాపు 500 లకు పైగా ఉన్న వీధి కుక్కల్లో దాదాపు 90 శాతం శునకాలకు ఇప్పటికే ఈ ఇన్ఫెక్షన్ సోకింది. అవి గ్రామంలోను, శేషాచల కొండపైనా, ఆలయ పరిసరాల్లోను స్వైరవిహారం చేస్తున్నాయి.

ఇది ఒక అంటువ్యాధి



శునకాలకు వచ్చిన ఈ చర్మవ్యాధిని డెర్మ టైటిస్ అంటారు. శుభ్రత లేని కారణంగా మరిం తగా వాటికి బ్యాక్టీరియా సోకి చివరకు మృత్యు వాత పడుతున్నాయి. పెంపుడు కుక్కల యజమానులు జాగ్రత్తలు పాటించాలి. ద్వారకా తిరుమలలో అధికశాతం కుక్కలకు ఈ వ్యాధి సోకింది. వేరే కుక్కలతో ఇవి తిరగడం వల్ల ఆవ్యాధి వీటికీ అంటుతోంది.

- డాక్టర్ అంగర సురేష్,పశువైద్యాధికారి

అంతుచిక్కని వ్యాధితో గేదె దూడలు మృతి

చాట్రాయి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలంలోని జనార్దనవరంలో అంతుచిక్కని వ్యాధితో గత 10 రోజుల నుంచి 10 గేదె దూడలు మృతి చెందాయి. పశుపోష కులు గూంట్రు నాగేశ్వరరావు, కాళంగి ఏడు కొండలు, కాళంగి గోపాలరావు తదితరులకు చెందిన 10 గేదె దూడలు మృత్యువాత పడ టంతో ఆవేదన చెందుతున్నారు. దూడలు ముందు రోజు పాలు తాగటం మానివేస్తున్నా యని, తరువాత రోజు జ్వరం వచ్చి మూడో రోజు చనిపోతున్నాయని బాధితులు అంటు న్నారు. పశువైద్యులు ఈ వ్యాధిని కనుగొని తగిన చికిత్స అందించాలని కోరుతున్నారు.



జనార్దవరంలో మృతి చెందిన దూడ

వ్యాక్సినేషన్ చేస్తాం

అస్వస్థతకు గురైన గేదె దూడలకు పశు వైద్య సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. దూడల మృతికి కారణాలు తెలుసుకొని మెరుగైన చికిత్స అందిస్తాం. గ్రామంలోని దూడలన్నిటికి ఆదివారం వ్యాక్సినేషన్ చేస్తాం. పశు పోష కులు ఆందోళన చెందవద్దు.

- డాక్టర్ శివ నాగేంద్రరావు, ఇన్‌చార్జి మండల పశు వైద్యాధికారి

పులిబొమ్మతో కోతుల బెడదకు చెక్

బూరుగుగూడెంలో ఓ రైతు ఐడియా



చాట్రాయి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పులిబొమ్మతో కోతుల బెడదకు రైతులు చెక్ పెడుతున్నారు. పంటలను కోతుల నుంచి కాపాడుకునేందుకు రైతులు పులిబొమ్మ, చింపాంజీ వేషాలు వేయడం వంటివి చేస్తున్నారు. చాట్రాయి మండలంలో అన్ని గ్రామాల్లో కోతుల సంఖ్య విపరీతంగా పెరిగి పోయింది. కోతుల మందలు మొక్కజొన్న చేలపై పడి ధ్వంసం చేస్తుండటంతో రైతులు పంటను కాపాడుకోటానికి అవస్థలు పడుతు న్నారు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు మొత్తం చేనుకు నాలుగు వైపులా కావలా ఉన్నా కోతులను అడ్డుకోలేకపోతున్నారు. పులి బొమ్మను రైతు భుజాలపై పెట్టుకొని మొక్క జొన్న చేలో తిరుగుతుంటే దాన్ని చూసి కోతులు ఆ ప్రాంతం నుంచి కుయ్యో మొర్రో అంటూ పారిపోతున్నాయి. తమ ఐడియా పని చేసి కోతుల బెడద తగ్గడంతో రైతులు సంతోషపడుతున్నారు.



అనివేటి మండపం గుండా రాకపోకలు సాగిస్తున్న భక్తులు

భక్తులతో కళకళలాడిన శ్రీవారి ఆలయం

ద్వారకాతిరుమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న ఆలయాన్ని శనివారం వేలాదిగా భక్తులు సందర్శించారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో దాదాపు పదివేల మందిపైబడి యాత్రికులు ఆలయానికి తరలివచ్చారు. పదో తరగతి పరీక్షలు జరుగుతుండటంతో భక్తుల రద్దీ కాస్త తగ్గినా ఆలయంలోని అన్ని విభా గాలు సందడిగా మారాయి. తమ మొక్కు బడు లను తీర్చుకున్న అనంతరం భక్తజనులు స్వామి, అమ్మవార్లను క్యూలైన్లలో వెళ్లి దర్శిం చుకు న్నారు. సాధారణ దర్శనానికి దాదాపు గంట పైబడి సమయం పట్టింది. స్వామివారిని దర్శించుకున్న అనంతరం వారంతా ఉచిత అన్న ప్రసాదం స్వీకరించారు.

30న ఉగాది ఉత్సవం

క్షేత్రంలో ఈనెల 30న శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవం నిర్వహిస్తామని ఆలయ ఈవో సత్యన్నారాయణమూర్తి తెలిపారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవారు ఉభయ దేవేరులతో శేషవాహనంపై కొలువై ఉగాది మండపం వద్దకు వస్తారని తెలిపారు. విశే షంగా అలంకరించిన ఉగాది మండపంలో స్వామి, అమ్మవార్లను ఉంచి విశేష పూజలు జరిపి అనంతరం పంచాంగ శ్రవణం జరుపు తామన్నారు. అనంతరం ఆలయానికి భూరి విరాళాలిచ్చిన దాతలకు, పండితులకు సత్కారం జరుగుతుందని వివరించారు.

బాలికలు అత్యంత జాగ్రత్తగా ఉండాలి

ఏలూరు క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో బాలికలపై అనేక దాడులు జరుగు తున్నాయని అత్యంత జాగ్రత్తగా ఉండాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు చొదిమెళ్ళలో ఉన్న అప్పర్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు బాలబాలికల వేధింపుల నిరోధక చట్టంపై ఏలూరు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రచన, జంగారెడ్డిగూడెం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.రాజ రాజేశ్వరి తేజస్వి, పాలకొల్లు రెండో అదనపు జూనియర్ జడ్జి లావణ్య, తణుకు మొదటి అద నపు జూనియర్ సివిల్ జడ్జి రంజిత్ కుమార్‌లు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ బాలబాలికల రక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని వాటిపై అవ గాహన పెంచుకోవాలన్నారు. ఎవరైనా వేధిం పులకు పాల్పడితే అధైర్య పడకుండా తల్లి దండ్రులకు కాని ఉపాధ్యాయులకు కాని తెలి యజేయాలని సూచించారు. సమాజంలో బాలి కలపై అనేక ఘోరాలు పెరిగిపోయాయని జాగ్ర త్తగా నడుచుకోవాలని సూచించారు. బాలలు చిన్ననాటి నుంచే పర్యా వరణ రక్షణ మీద దృష్టి సారించాలన్నారు. మొక్కలు నాటడం వల్ల మంచి భవిష్యత్తులో జీవించవచ్చునన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జంగారెడ్డిగూడెం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి తేజస్వి

పిల్ల రొయ్యదే పెత్తనం

విత్తు మంచిదైతే చెట్టు మంచిదవుతుందని నానుడి.. ఆక్వా సాగులో కూడా ఇదే మాట అక్షర సత్యంగా నిలుస్తుంది. రొయ్య చెరువుల విషయంలో మంచి రొయ్య సీడ్ ఎంపిక కీలకంగా నిలుస్తుంది. మంచి విత్తనం దొరికితే పంట పండినట్టే.. దళారుల మాట నమ్మి నాణ్యత లేని సీడ్ కొని చాలామంది రైతులు లక్షల్లో నష్టపోతు న్నారు.. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో ఈ జనవరిలో 1.75 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేశారు. లక్షా 50 వేల టన్నులు దిగుబడి వస్తుందని అంచనా..



నాణ్యమైన సీడ్‌తోనే మంచి దిగుబడులు
దళారులను నమ్మి నష్టపోతున్న రైతులు
తగిన జాగ్రత్తలు తీసుకుని కొనుగోలు చేయాలి

నిడమర్రు మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : డాలర్ పంటగా పేరుగాంచిన రొయ్యలసాగులో సీడ్‌దే ప్రధాన భూమిక. పిల్ల బాగుంటే పంట బాగుంటుంది. నాణ్యమైన రొయ్య పిల్లల కోసం రైతులు ఎన్నో ప్రయత్నాలు చేస్తూంటారు. తోటి రైతులను ఆశ్రయించడమో, దళారుల మాయమాటలు నమ్మో సీడ్ కొనుగోలు చేస్తుంటారు. కొంతమంది రైతులు ఆయా హేచరీలలో టెక్నీషియన్ల ద్వారా నాణ్యమైన బ్యాచ్ వచ్చినప్పుడు ముందుగా అడ్వాన్సు బుకింగ్ చేసుకొని రొయ్య పిల్లను కొనుగోలు చేస్తుంటారు. చాలా సందర్భాల్లో నాణ్యత తక్కువగా గల సీడ్ కొనుగోలు చేసి లక్షల్లో నష్టపోతున్నారు. ఆరుగాలం ఇల్లూ వాకిలి వదిలి చెరువులు చుట్టూ తిరిగి పంట పండించిన రైతుకు నష్టమే మిగులుతోంది .తమకు పెట్టుబడి ఖర్చులు కూడా రాకుండా పోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దళారులదే రాజ్యం

సంప్రదాయ రొయ్యసాగుకు అలావాటుపడ్డ మన రైతాంగం పక్కచెరువు రైతులు ఏ సీడ్ బుక్ చేస్తే అదే బుక్ చేయమని చెబుతుంటారు. ఇటీవల రొయ్య సీడ్ కంపెనీలు ఏజెంట్లును నియమించుకుని లక్ష సీడ్ అమ్మితే 3 వేల నుంచి 5 వేల వరకు కమీషన్ ఇస్తామని చెప్పడంతో వారు రైతులను మభ్యపెట్టి సీడ్ అమ్ముతున్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా సీడ్‌ను తయారుచేసి రైతులకు అంటగడుతున్నారు. ఈ విషయంలో ఆక్వా అథారిటీ సరైన చర్యలు తీసుకోవడం లేదు. హేచరీ కంపెనీ వారు రొయ్య నాణ్యతను తెలియజేస్తూ ఇవ్వాల్సిన పరీక్షల రిపోర్టు కాపీలను రైతులకు ఇవ్వడం లేదు. రైతులు తమ చెరువులో సీడ్ వదిలిన 20 రోజుల తర్వాత ఆఫా, చెక్‌నెట్‌ల ద్వారా రొయ్య సీడ్ చెక్ చేసుకొంటే సీడ్ నిలబడకపోతే ఆ కంపెనీలు సమాధానం కూడా చెప్పడం లేదు. ఆ 20 రోజులకు రైతులు ఫీడ్ ఖర్చుల కింద లక్షల్లో నష్టపోతున్నారు.



రొయ్యల చెరువులో వేయడానికి తీసుకువెళుతున్న సీడ్

రొయ్య సీడ్ హేచరీలు

గతంలో పశ్చిమ తీరం నుంచి అనగా పాండిచ్చేరి నుంచి ఎక్కువగా రొయ్య సీడ్‌ను రైతులు తెప్పించుకొని సాగు చేసేవారు. కానీ ఇటీవల నెల్లూరు, కాకినాడ, ఒంగోలు, భోగాపురం ప్రాంతాలలో బ్లూడర్‌ను తెచ్చుకొని నాణ్యతా ప్రమాణాలతో సీడ్ ఉత్పత్తి చేస్తున్నారు. కొన్ని హేచరీలు నేప్లీ (అతి చిన్న రొయ్య సీడ్)లను దిగుమతి చేసుకొని నాణ్యతలేని మేతను వేస్తూ రోగ నిరోధకశక్తి పెంచే ఔషధాలు వాడకుండా సీడ్‌ను అమ్ముతున్నారు. దీని వల్ల రైతులు లక్షల్లో నష్టపోతున్నారు.

• నాణ్యమైన సీడ్‌తోనే మంచి దిగుబడి



సుమారు 10 ఎకరాల వరకు రొయ్యల చెరువులను సాగుచేస్తున్నాను.నాణ్యమైన సీడ్ వేయక పోవడం వల్ల రొయ్యలకు వైట్‌కట్, విబ్రియో, ఈహెచ్‌పీ వంటి రోగాలు వచ్చే అవకాశం ఉంది. లక్షల్లో పెట్టుబడి పెట్టి చేసే ఈ సాగులో నాణ్యమైన సీడ్ ద్వారా మంచి దిగుబడి సాధించగలం. హేచరీలు నాణ్యమైన సీడ్ అందించేలా ఎంపెడా తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు కఠినమైన నిబంధనలు అమలు చేసి కల్తీలేని, నాణ్యమైన రొయ్య సీడ్‌ను రైతులకు అందించాలి.

-కొత్యాల కార్తీక్, రొయ్య రైతు, ఛువ్వనపల్లి

• అన్ని టెస్టులు చేసిన తర్వాతే కొనాలి



రొయ్య సాగులో సీడ్‌దే ప్రధాన పాత్ర. మంచి సీడ్ ఎంపిక చేసుకొంటే సగం క్రాప్ తీసినట్టే. సీడ్ ఎంపికలో రైతులు దళారులు మాటవిని నాణ్యత లేని నేప్లీలను వేసుకొని మోసపోవద్దు. సొంత బ్రూడర్ కలిగిన హేచరీలను మాత్రమే ఎంపిక చేసుకోవాలి. టెస్టులు చేసిన రొయ్యసీడ్‌ను మాత్రమే కొనుగోలు చేసుకొవాలి. వేసవిలో వైట్ కట్ ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున నాణ్యతగల సీడ్ వేయాలి. చెరువు నీటికి రెండు గంటల పాటు సీడ్‌ను అలవాటు చేశాకే వదలాలి.

- జువ్వలపల్లి రవీంద్ర, ఆక్వా ఫీడ్ టెక్నీషియన్, నిడమర్రు

నాణ్యమైన రొయ్య పిల్ల ఎంపిక ఇలా ..

- ప్రభుత్వ గుర్తింపు పొందిన హేచరీని ఎంపిక చేసుకోవాలి. హేచరీ ఎంపికతో పాటు బ్రూడర్ స్టాక్ కూడా అప్రూవ్ కల్గి ఉండాలి. బయోసెక్యూర్డ్ ఉన్న హేచరీ నుంచి తీసుకోవాలి.
- ఆర్‌టీ పీసీఆర్ టెస్ట్ సొంతంగా చేయించుకొని మంచి సీడ్ అని నిర్ధారణ అయ్యాకే సీడ్ కొనుగోలు చేసుకోవాలి. దీనిలో ఈహెచ్‌పీ టెస్ట్, విబ్రియో టెస్ట్, వైట్ స్పాట్ టెస్ట్‌లలో నెగెటివ్ రావాలి. సొంత బ్రూడర్ రొయ్య కల్గిన హేచరీ నుంచి కొనుగోలు చేయాలి.
- సీడ్ ఈఎల్ వయసు 12 రోజులు ఉండడం చాలా ఉత్తమం. అదీకాకపోతే పది రోజులు ఉన్నవైనా ఎంచుకోవాలి. ఓజోన్ సెక్యూరిటీ సిస్టమ్ ద్వారా వాటర్‌ను వాడే రొయ్య పిల్ల హేచరీల నుంచే కొనుగోలు చేసుకోవాలి.
- గతంలో కోనాబే రకం ఎక్కువగా సాగు అయ్యేది. తర్వాత హర్డీలైన్ రకం నడిచేది. ప్రస్తుతం నూతనంగా విడుదలైన వైట్‌కట్ తట్టుకొనే సై ఆక్వా రకం సీడ్ ఎంపిక చేసుకోవడం ద్వారా నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.
- మైక్రోస్కోపిక్ పరీక్ష, గ్రాస్ ఎగ్జామినేషన్ పరీక్ష, విబ్రియో పరీక్ష, పాలీమరైజ్ చైన్ రియాక్షన్ -పీసీఆర్ పరీక్ష , స్ట్రెస్ టెస్ట్‌లను స్వయంగా చేయించుకొని కొనుగోలు చేయాలి.ప్యాకింగ్ చేసే సమయం రాత్రి 8 గంటల తర్వాతే జరిగేలా చూసుకోవాలి.
- రొయ్య పిల్ల చెరువులో వదిలే సమయంలో ఓ డ్రమ్‌లో వేసి ఆక్సిజన్ పెట్టి రెండు గంటలపాటు ఉంచి తర్వాత మన చెరువు నీటికి అలవాటు చేస్తూ సీడ్ వదలాలి.
- రొయ్యపిల్ల ప్యాకెట్లు చెరువునీటి మీద సుమారు 2 గంటలపాటు తేలియాడే విధంగా ఉంచితే చెరువులో పీహెచ్ రొయ్య సీడ్ ప్యాకెట్‌లో పీహెచ్ సమానమవ్వడం ద్వారా 100 శాతం మనగిలిగేందుకు అవకాశం ఉంటుంది.

తాబేళ్లు పరుగెడుతున్నాయ్



కొల్లేరు కేంద్రంగా అక్రమ రవాణా
చేపల వ్యానుల్లో సరిహద్దులు దాటేస్తున్నాయి
ఇతర రాష్ట్రాల్లో ఎక్కువ గిరాకీ
జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు
కొరవడిన అధికారుల నిఘా

కైకలూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు సరస్సు వివిధ రకాల మత్స్యసంపదకు పేరు. విదేశీ పక్షులకు ఆలవాలం. ఇలాంటి కొల్లేరు కేంద్రంగా అక్రమ తాబేళ్ల రవాణా యధేచ్ఛగా సాగుతోంది. అక్కడకక్కడా దొరికిన తాబేళ్ళను గోనెసంచుల్లో మూటకట్టి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. కైకలూరు నుంచి చేపల ఎగుమతి ముసుగులో ఈ తాబేళ్ల రవాణా జరుగుతోంది. అంతరించిపోతున్న తాబేళ్ల జాతిని పరిరక్షించాల్సిన అటవీశాఖ అధికారులు పట్టించు కోకపోవడంతో జిల్లాలు, రాష్ట్రాలు సరిహద్దులు దాటి తరలిపోతు న్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 356 రకాల తాబేళ్ల జాతులున్నట్లుగా పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. కొల్లేరు మంచినీటి సరస్సు పరివాహాక ప్రాంతంలో ఉండే ఈ తాబేళ్లకు ఇతర రాష్ట్రాల్లో మంచి గిరాకీ ఉండడంతో అక్రమార్కుల కన్ను వీటిపై పడింది. వీటిని పట్టి రవాణా చూస్తూ రూ.లక్షల్లో జేబులు నింపుకుంటు న్నారు. కలిదిండి మండలం మద్దవానిగూడెం వద్ద, కైకలూరు మండలం ఉప్పుటేరు వద్ద ఉన్న చెక్ పోస్టులను అక్రమార్కులు మేనేజ్ చేయడంతో సరిహద్దులు దాటేస్తున్నాయి.



గతంలో స్వాధీనం చేసుకున్న తాబేళ్లను కొల్లేరులో వదిలి వేస్తున్న అటవీశాఖ అధికారులు (ఫైల్ ఫొటో)

వివిధ ప్రాంతాల నుంచి సేకరణ

కైకలూరు నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి మండలాల నుంచి కొల్లేరు ఇతర ప్రాంతాల్లో చేపల పట్టుబడుల సమయాల్లో వలలకు చిక్కిన తాబేళ్ళను మత్స్యకారులు, యానా దుల నుంచి వారి వలలకు చిక్కిన తాబేళ్ళను సేకరించి ఒక్కొక్కటి రూ.5 నుంచి రూ.10 వరకు కొనుగోలు చేస్తున్నారు. చెరువులు, కాలువల నుంచి సేకరించిన తాబేళ్లను జనసంచారం లేని బహిరంగ ప్రదేశాల్లో నిల్వచేస్తున్నట్లు సమాచారం. ఎగుమతులకు సరిపడా సేకరించిన తరువాత వాటిని చేపల వ్యానుల్లో ట్రేల చాటున గోనెసంచుల్లో ఉంచి రాత్రివేళల్లో సరిహద్దులు దాటిస్తు న్నారు. వారానికి రెండు నుంచి మూడు రోజులు వేల టన్నుల్లో అక్రమ రవాణా జరుగుతున్నా అధికారుల కంట పడడం లేదు.

ఇతర రాష్ట్రాల్లో వీటి మాంసానికి గిరాకీ

ఈ తాబేళ్లకు ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉండడంతో ఒడిశా, అస్సోం, గోవా, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ మాంసానికి గిరాకీ ఎక్కువగా ఉంటుంది. సుమారుగా కేజీ రూ.300 నుంచి రూ.400కు అమ్మకాలు జరుగుతున్నాయి. వీటిని స్థానికంగా రూ.10 నుంచి రూ.15కు కొనుగోలు చేసి రూ.100 నుంచి రూ.150కు విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. వన్య ప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ యథేచ్ఛగా రవాణా చేస్తూ రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. వన్యప్రాణుల చట్టం 1972 ప్రకారం తాబేళ్లను వేటాడినా, రవాణా చేసినా ఏడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 వేలు వరకు జరిమానా విధిస్తారు. అయితే వీటిపై నిఘా లేకపోవడంతో వారి రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఆయా రాష్ట్రాల్లో ఆయుర్వేద ఔషధాల్లో వీటి మాంసాన్ని వినియోగిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు తాబేళ్ల అక్రమ రవాణాను అడ్డుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

• అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

తాబేళ్ల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. 45 రోజుల క్రితం కలిదిండి ప్రాంతంలో నూజివీడు టెరిటోరియల్ అటవీ శాఖ అధికారులు ఒక ఆటోను అదుపు లోకి తీసుకుని పది ట్రేలలో ఉన్న తాబేళ్లను స్వాధీనం చేసుకోవడమే గాక ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కొల్లేరు ప్రాంతంలోనూ ఇతర సరిహద్దుల్లోనూ అటవీశాఖ అధికారులు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. ఎక్కడైనా రవాణా జరుగు తున్నట్లు తెలిస్తే సమాచారం అందిచాలి.

- రామలింగాచార్యులు, రేంజర్ , కైకలూరు

కొల్లేరు పంటకోడు ఆక్రమణపై ఫారెస్టు అధికారుల విచారణ

నిడమర్రు మార్చి 22 (ఆంధ్రజ్యోతి) నిడమర్రు మండలం దేవర గోపవరం గ్రామ శివారు కొల్లేరు సరస్సు 5వ కాంటూరు పరి ధిలో ఖండ్రిక పంట కాలువ ఆక్ర మించు కోవడంపై స్థానికుడు తుమ్మూరి శ్రీను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శనివారం జిల్లా ఫారెస్టు అధికారులు చెరువులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మోహినీ విజ యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన విచారణలో ఆక్రమ ణలకు గురైన ఖండ్రిక పంటకాలువ సుమారు 9 ఆక్వా చెరువలులో ఉందని సుమారు 1.5 కి.మీ విస్తీర్ణం ఆక్రమణలకు గురైందని నిర్ధారిం చారు. 9 ఆక్వా చెరువుల రైతులకు సంబంధి ంచి 100 ఎకరాల విస్తీర్ణంలో గల ఆక్వా చెరు వుల రైతులకు చెరువులు ఖాళీ చేయవల సినదిగా నోటీసులు అందించారు. నోటీసులు అందుకొన్న రైతులు తమకు కొంతసమయం కావాలని కోరడంతో చట్టప్రకారం నడుచు కోవాలని సూచించారు. డీఎఫ్‌వో విజయ, సెక్షన్ ఆఫీసర్ గంగారత్నం. నిడమర్రు తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ బి.మోహినీ విజయలక్ష్మి, సిబ్బంది

వేగంగా పాలకొల్లు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు

పాలకొల్లు అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు రైల్వేస్టేషన్‌కు సంబంధించి వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతు న్నాయని డీఆర్‌యూసీ సభ్యుడు జక్కంపూడి కుమార్ తెలిపారు. స్టేషన్‌లో జరుగుతున్న పనులను, ఇన్‌చార్జి స్టేషన్ మాస్టర్ స్నేహతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ పాలకొల్లు, తణుకు, ఆకివీడు స్టేషన్లలో సుమారు రూ.20 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, పాలకొల్లులో డ్రెయినేజీ నిర్మాణాలు, గూడ్స్ షెడ్లు, హమాలీల రెస్ట్ రూంలు, సైకిల్ స్టాండ్, ప్రహరీగోడ, వాటర్ పైపులైను పనులు జరుగుతున్నాయని తెలిపారు. కొల్లి కొండ ప్రసాద్, బోడ సత్య కనకరాజు (సతీష్), చెరు కూరి శ్రీనివాసరావు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



రైల్వేస్టేషన్‌లో పరిశీలిస్తున్న డీఆర్‌యూసీ సభ్యుడు కుమార్, స్టేషన్ మాస్టర్ స్నేహ



ఉద్యాన పంటల ప్రదర్శన పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు : ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు ఉద్యాన పరిశోధన కేంద్రంలో కిసాన్ మేళా

కొవ్వూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక సహకారాన్ని అందిస్తూ, రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునిస్తున్నట్లు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు డాక్టర్ వైఎస్ఆర్ హెచ్‌యూ ఉద్యాన పరిశోధన కేంద్రంలో శనివారం కిసాన్‌మేళా-2025 నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ముప్పిడి, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చ రల్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె. గోపాల్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతుల సంక్షేమంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపా డడం కోసం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్స హిస్తోందన్నారు. వైస్ చాన్సలర్ డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యాన పంటల ఉత్పత్తి ఎక్కువగా ఉందన్నారు.విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ బి. గోవిందరా జులు మాట్లాడుతూ ఆరు దశాబ్దాలుగా పరిశో ధనా స్థానంలో అభివృద్ధి చేసిన యాజమాన్య పద్ధతులు సస్యరక్షణ పద్ధ తులపై శిక్షణ నిర్వ హిసున్నామన్నారు. కొవ్వూరు ఉద్యానవన పరిశో ధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త లలితాకామేశ్వరి మాట్లాడుతూ గత పదేళ్లలో 13 లక్షల టిష్యూ క ల్చర్ మొక్కలను అందజేశామన్నారు. ఈ మేళా 25లో ఉద్యాన విశ్వ విద్యాలయం పరిధిలోని పరిశోధనా కేంద్రాలు అంబాజీపేట, పందిరిమా మిడి, పెద్దాపురం, వెంకట్రామన్నగూడెం శాస్త్రవే త్తల ఆధ్వర్యంలో వివిధ ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మద్దిపట్ల శివరామ కృష్ణ, దాయన రామకృష్ణ, నూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్ పాల్గొన్నారు.



మేరీమాత మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పీఠాధిపతి జయరావు, తదితరులు

నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు ప్రారంభం

దేవరపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): యావత్ ప్రపంచం సుఖశాంతులతో ఉండాలనేదే మేరీమాత తల్లి ఆకాంక్షని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు పేర్కొన్నారు. నిర్మలగిరిలో మేరీమాత మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు పుణ్యక్షేత్రం అఖండ దేవాలయంలో ఏర్పాటు చేసిన బైబిల్ ప్రదర్శనను తిలకించారు. నూతనంగా భక్తుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లను ఆయన ప్రారంభించారు. నిర్మలగిరి మేరీమాత మందిరం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, పాదర్లు బాల, ప్రసాద్, నిర్మలగిరి పుణ్యక్షేత్ర అన్నదాన కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయానికి రూ.1,51,116 విరాళం



గోపురం బంగారుతాపడం నిమిత్తం విరాళం అందజేసిన ఎనికేపల్లి శ్రీనివాసరావు

ఇంద్రకీలాద్రి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దుర్గమ్మ ఆలయ గోపురానికి బంగారు తాపడానికి శనివారం ఏలూరు జిల్లా పూళ్ళ గ్రామానికి చెందిన ఎనికేపల్లి శ్రీనివాసరావు రూ. 1,51,116 విరాళాన్ని చెక్కు రూపంలో అందచేశారు. ఆలయంలో అన్న వితరణ నిమిత్తం విజయవాడకు చెందిన ఎన్ వెంకట నాగేశ్వరరావు పేరిట ఆయన కుటుంబ సభ్యులు రూ.లక్ష అందచేశారు.

● ద్వారకాతిరుమల : శ్రీవారి ఆలయంలోని విమానగోపుర స్వర్ణమయ పథకం ట్రస్టునకు ఇడిముడి శ్రీను రూ.1.51 లక్షలను విరాళంగా అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ ఏఈవో విరాళం బాండు అందించారు.

పరీక్షార్థుల్లో 'నన్నయ' విద్యార్థులే ఎక్కువ

దివాన్‌చెరువు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్నత విద్యలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాల పరిధిలోనే ఎక్కువ మంది పరీక్షలు రాస్తారని ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ అన్నారు. అందుకే పరీక్షల నిర్వహణపై కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీకళాశాలల్లో సోమవారం నుంచి డిగ్రీ, బీఈడీ, లా పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో శనివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాలలను వీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని 109 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 22 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. అలాగే బీఈడీ, బీపీఈడీ, డీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల నిమిత్తం 20 కేంద్రాల్లో 2500 మంది, లా 8, 10 సెమిస్టర్ పరీక్షలకు మూడు కేంద్రాల్లో 500 మంది హాజరవుతారని చెప్పారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లను కళాశాల నిర్వాహకులు పర్యవేక్షించాలని తెలిపారు.



ఎక్స్‌పో బ్రోచర్లు చూపుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు

నరసాపురం లేసుకు ప్రత్యేక గుర్తింపు

హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో ప్రారంభించిన కేంద్ర మంత్రి

నరసాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయి ఉత్పత్తుల్లో నరసాపురం లేసు అల్లికలకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఆ ఘనత స్థానిక మహిళలకే దక్కుతుందని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. రుస్తుంబాదా లేసు ట్రేడింగ్ సెంటర్‌లో నిర్వహించిన హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచ మార్కెట్ కొత్త ట్రెండ్‌ను కోరుకుంటుందన్నారు. దానికి అనుగుణంగా మహిళలు ఉత్పత్తులు చేస్తే ఆర్థికంగా నిలదొక్కుకుంటారన్నారు. వివిధ రాష్ట్రాల్లోని హస్తకళాకారుల్ని ఒక చోటకు చేర్చి ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రానున్న రోజుల్లో చేతివృత్తుల కళలకు ఎన్నో అవకాశాలు ప్రభుత్వం కల్పించేందుకు సిద్ధంగా ఉందన్నారు. విప్ నాయకర్ మాట్లాడుతూ లేసు పరిశ్రమకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు అందిస్తున్న శిక్షణలను వినియోగించుకుని మహిళలు నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ నరసాపురం లేసు ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న బ్రాండ్ చెరగదన్నారు. టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి, కొవ్వలి నాయుడు ప్రసంగించారు. అనంతరం సెంటర్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఈపీసీహెచ్ ఈడీ ఆర్‌కె వర్మ, కలవకొలను తులసీ, తాతాజీ, రాజీవ్ పాల్గొన్నారు.

తణుకులో ట్రాన్స్‌జెండర్ల ఆందోళన



తణుకు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో ట్రాన్స్‌జెండర్ దీపును హత్య చేసిన దుర్గా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని శనివారం సాయంత్రం ట్రాన్స్ జెండర్లు నరేంద్ర సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. దీపును దారుణంగా హత్య చేసిన ఇరగవరం మండలం పొదలాడ గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్‌ను ఉరితీయాలని అన్నారు. ఎక్కడో ఉన్న దీపుతో సహజీవనం చేస్తున్న దుర్గా ప్రసాద్ ఇటీవల దారుణంగా హత్య చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్లు సర్పకన్య, నాయకమ్మ, దివ్య పాల్గొన్నారు.

సీలేరు నుంచి నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టాలో వ్యవసాయ అవసరాల కోసం సీలేరు నుంచి బైపాస్ మార్గం ద్వారా మరో 1000క్యూసెక్కులు పెంచి 4వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పవర్ జనరేషన్ ద్వారా 3వేల క్యూసెక్కులకు పైగా గోదావరికి విడుదల అవుతోంది. దీంతో గోదావరిలో నీటి లభ్యత 10,700క్యూసెక్కులుగా నమోదైంది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు 10,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 3200 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2000 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 5500 క్యూసెక్కులు విడుదల అవుతోంది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 9.85 అడుగులుగా నమోదైంది.

ధర్నా, రాస్తారోకో జయప్రదం చేయండి

ఏలూరు రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కోకో గింజలు కొనుగోలు చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24, 25 తేదీల్లో మండలాల్లో ధర్నాలు, రాస్తారోకో నిర్వహించాలని, కోకో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం ఏలూరు మండలం చొదిమెళ్లలో కోకో రైతుల సంఘం నాయకులు పర్యటించి సమస్యలడిగి తెలుసుకున్నారు. ధర సమస్యపై ఉద్యానశాఖ రాష్ట్ర డైరెక్టర్ సమక్షంలో చర్చలు జరిగినా ఫలితంలేదన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.సతీష్‌బాబు, పి.నాని, పి.సుధాకర్, కోకో రైతులు పాల్గొన్నారు.

హద్దులు చెరిపేస్తున్నారు..!

ముమ్మరంగా వైఎస్ఆర్ భూరక్ష సర్వే రాళ్ల తొలగింపు పనులు



పొలాల్లో తొలగించిన సర్వే రాళ్లు

ఏలూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గతంలో వైసీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ భూ రక్ష పథకం అంటూ సర్వేరాళ్లతో హద్దులను నిర్దేశించారు. తీరా ఆచరణలో ఈ పథకం ఫెయిల్ అయ్యింది. అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం ఇప్పుడు భూముల రీ సర్వేతో సమూలంగా సర్వే రాళ్ల తొలగింపును చేపట్టింది. గత ప్రభుత్వం ఆర్భాటాలకు పోయి కోట్ల ఖర్చుపెట్టి ఇష్టారాజ్యంగా బండల్లాంటి రాళ్లను సర్వే రాళ్లుగా మలిచి దౌర్జన్యంగా భూముల్లోకి దించేశారు. వీటిని పూర్తిగా తొలగించాలన్న నూతన ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా యంత్రాంగం కొద్ది నెలలు క్రితం నుంచి చేస్తున్న కసరత్తు పూర్తి అయ్యే దశకు వచ్చింది. జగనన్న భూ హక్కు రక్ష పథకం కింద పెద్ద ఎత్తున సర్వే రాళ్ల ఏర్పాటు కోసం ముడి సరుకును గ్రానైట్ పరిశ్రమలకు రప్పించారు. నాపరాళ్లు తయారు చేసి వారికి అందించి వారి నుంచి నిర్దేశిత నమూనాలో సర్వే రాళ్లను తయారు చేయించి తెప్పించి గ్రామాల్లో హద్దులను నిర్దేశించారు.

ఏలూరు జిల్లాలో 91.86 శాతం రాళ్లు తొలగింపు

ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన సర్వే రాళ్ల తొలగింపు ప్రక్రియ ఏలూరు జిల్లాలో 91.86 శాతం మేర పూర్తి అయ్యింది. త్వరలో జరిగే జిల్లా కలెక్టర్ల సదస్సులో ఈ అంశంపైన సమీక్ష జరిగే అవకాశం ఉంది. భూముల రీ సర్వే తర్వాత ఈ రాళ్లను తిరిగి ఉపయోగించే అవకాశం ఉంది. జిల్లాలో 245 గ్రామాల్లో 2,87,522 రాళ్లను అప్పటి ప్రభుత్వం సరఫరా చేసింది. ఇందులో ఏలూరు రెవెన్యూ డివిజన్‌లోని 101 గ్రామాల్లో లక్షా2వేల930 ఏర్పాటు చేయగా, ఇందులో 99,125, జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని 104 గ్రామాల్లో లక్షా42వేల325కు గాను లక్షా25వేల557, నూజివీడు డివిజన్‌లోని 40 గ్రామాల్లో 42,267 రాళ్లకు 39,433 సర్వే రాళ్లను తొలగించారు. ఈ సమాచారాన్ని సీఎంకు జిల్లా యంత్రాంగం నివేదించనుంది.

వెళ్లిపోదాం!

- నిర్వాసితుల తరలింపునకు రంగం సిద్ధం
- జూన్ నెలలో 16 గ్రామాల్లోని 1554 కుటుంబాల తరలింపు
- రూ.354 కోట్ల పరిహారం అందజేత
- 18 సంవత్సరాలు పరిహారానికి కటాఫ్ 2017 జూన్ 6
- ఐటీడీఏ పీవో, ఆర్‌అండ్ఆర్ ఆఫీసర్ కె.రాములు నాయక్

బుట్టాయగూడెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జూన్ నెలలో వర్షాలు ప్రారంభానికి ముందే 41వ కాంటూరు పరిధిలోని నిర్వాసితులను తరలించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కెఆర్ పురం ఐటీడీఏ పీవో, ఆర్‌అండ్ఆర్ ఆఫీసర్ కె.రాములు నాయక్ తెలిపారు. శనివారం తనను కలిసిన 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన 29 గ్రామాలు ముంపునకు గురవుతుండగా 45 కాంటూరును 41లో కలపడం వలన అదనంగా మరో 16 గ్రామాలు ముంపునకు గురవుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు.





బుట్టాయగూడెంలో నిర్మించిన నిర్వాసితుల కాలనీ.. ఐటీడీఏ పీవో రాములు నాయక్

తరలించే గ్రామాలు ఇవే..

ఈ ఏడాది జూన్‌లో వేలేరుపాడు మండలంలో 14, కుక్కునూరు మండలంలోని 2 మొత్తం 16 గ్రామాలైన ఎడవల్లి, బొల్లపల్లి, కాచరం, కాకిస్నూర్, పెదమానుకొల్లు, కొత్తూరు, తురుపుమెట్ట, పేరంటాలపల్లి, యర్రంపేట, సిద్ధారం, చింతలపాడు, చిట్టంరెడ్డిపాలెం, టేకుపల్లి, టేకూరు, పోచారం, లచ్చగూడెంలలోని 1554 కుటుంబాలను తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రాములు నాయక్ తెలిపారు. 354 కోట్ల రూపాయలు నిర్వాసితులకు పెండింగ్ పరిహారంగా జనవరిలో అందజేశామన్నారు. 45 కాంటూర్‌లోని 16 గ్రామాలను శాటిలైట్ ఆధారంగా ముంపునకు గురవుతున్నాయని గుర్తించి 41 కాంటూర్‌లో కలపడం జరిగిందన్నారు. అలా చేయడం వలన 16 గ్రామాల్లోని 1554 కుటుంబాలు ముంపునకు గురవుతున్నాయని గుర్తించామని తెలిపారు.

పునరావాస కాలనీలు ఇవే..

నిర్వాసితులను బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండలాల్లో ఇప్పటికే నిర్మించిన పునరావాస కాలనీలకు తరలిస్తామని రాములు నాయక్ తెలిపారు. అవార్డు పాస్ చేయడానికి 16 గ్రామాల్లో గ్రామసభలు పెట్టామని ఇప్పటికే 5 గ్రామాల్లో నివేదికలు సిద్ధం చేసి ధవళేశ్వరం ఆర్‌అండ్ఆర్ ప్రత్యేక అధికారికి సమర్పించినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా మార్చి, ఏప్రిల్ నెలాఖరుకు అవార్డు కోసం నివేదికలు పూర్తి చేస్తామన్నారు.

కాలనీల్లో సౌకర్యాలు కల్పిస్తాం

నిర్వాసితుల తరలింపునకు ఆయా మండలాల్లో కాలనీల నిర్మాణాలు పూర్తిచేయగా నిర్వాసితులు కాలనీలకు వెళ్ళకపోవడంతో తలుపులు, కిటికీలు ఇతర కట్టడాలు పాడైపోయినట్లు గుర్తించామని వాటిని బాగుచేసిన తర్వాతనే నిర్వాసితుల తరలింపు ఉంటుందన్నారు. వీటితోపాటు కాలనీల్లో రోడ్లు, విద్యుత్, మంచినీరు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని అందుకోసం 104 కోట్ల రూపాయలు సిద్ధంగా ఉన్నాయన్నారు. కాలనీల్లో సమస్యలను గుర్తించి మే నెలాఖరుకు పూర్తిచేసి జూన్‌లో నిర్వాసితులను కాలనీలకు తరలించడం చేపడతామన్నారు. ఆర్‌అండ్ఆర్‌కు సంబంధించి ఇంకా 283 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆఫీసర్ రాములు నాయక్ తెలిపారు. ఆర్‌అండ్ఆర్‌లో 18 సంవత్సరాలు నిండినవారికి పరిహారం అందించాలంటే 2017 జూన్ 6వ తేదీని కటాఫ్ డేట్‌గా గుర్తించినట్లు తెలిపారు. అంతకుముందువారికే పరిహారం అందుతుందన్నారు. కటాఫ్ డేట్ మార్చాలని గిరిజనులు కోరుతున్నారని దీనితోపాటు ఇతర సమస్యలను తన దృష్టికి తీసుకువస్తున్నారని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనలను కాదని తామేమి చేయకూడదని స్పష్టం చేశారు.

పోలీస్ స్టేషన్ నుంచి నిందితుడి పరారీ

ఆపసోపాలు పడి పట్టుకున్న పోలీసులు

భీమవరం క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల క్రితం ఒక మహిళ లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేసింది. ఆ కేసులో నిందితుడిగా ఉన్న ఒక వ్యక్తిని భీమవరం పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం రాత్రి పోలీసులు అప్రమత్తంగా లేకపోవడంతో ఆ వ్యక్తి పరారైనట్లుగా తెలుస్తుంది. దీంతో అధికారులు అప్రమత్తమై పలు బృందాలను గాలించడానికి పంపించారు. భీమవరం బస్టాండ్ వద్ద శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నట్లుగా సమాచారం. గతంలో కూడా ఆ పోలీస్ స్టేషన్‌కు సంబంధించి ఒక కేసులో నిందితుడిని కోర్టుకు తీసుకువెళుతుండగా పరారయ్యాడు. అప్పుడు పోలీసులు అప్రమత్తమై గాలించి నిందితుడిని పట్టుకున్నారు.

విద్యార్థి మృతదేహం లభ్యం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 22 (ఆంధ్ర జ్యోతి): పెంటపాడు మండలం పరిమెళ్లలో ఈతకు వెళ్లి గల్లంతైన ఇంజనీరింగ్ విద్యార్థి పల్లెపోగు వరప్రసాద్ (20) మృత దేహం శనివారం లభ్యమైంది. వరప్రసాద్ శుక్రవారం స్నేహితులతో సరదాగా ఈతకోసం వెళ్లి ప్రమాదవశాత్తూ కాలువలో గల్లంతయ్యాడు. వరప్రసాద్ ఆచూకి కోసం పోలీస్, అగ్నిమాపక సిబ్బంది శుక్రవారం రాత్రి వరకూ గాలించినా లభ్యం కాలేదు. చివరికి శనివారం కిలోమీటరున్నర దూరంలోని వెస్ట్ విప్పర్రు సమీపంలో లభ్యమైంది. గుంటూరుకు చెందిన తల్లిదండ్రులు వరప్రసాద్ మృతదేహాన్ని చూసి దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

బైక్ పైనుంచి పడి మహిళ మృతి

మొగల్తూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళుతుండగా జారి పడిన సంఘటనలో మహిళ మృతి చెందిన ఘైనమిది. హెడ్ కానిస్టేబుల్ జొనాతన్ తెలిపిన వివరాల ప్రకారం భీమవరం మండలం వెంప పంచాయతీ పరిధి కొత్తపేటకు చెందిన మోతుకూరి మంగామనోహర్ ఆయన భార్య లక్ష్మీ (38) శుక్రవారం వారి ఇంటి నుంచి మొగల్తూరుకు బైక్‌పై వస్తున్నారు. అడవి మల్లిఖార్జునస్వామి ఆలయ సమీపం వద్దకు వచ్చే సరికి వీరి బైక్‌కు గేదె అడ్డురావడంతో మనోహర్ షడన్ బ్రేక్ కొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న లక్ష్మీ కిందపడి తీవ్రంగా గాయాలపాలైంది. 108 వాహనంలో భీమవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ శనివారం మృతి చెందిదని హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

తెలంగాణలో 120 కేజీల గంజాయి పట్టివేత



నిందితులను అరెస్టు చేసిన తెలంగాణ పోలీసులు

కుక్కునూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలోని బూర్గంపాడు గ్రామ శివారుల్లో 60లక్షల 57వేలు విలువ చేసే 120కేజీల గంజాయి పట్టుబడింది. దీనిపై భద్రాద్రికొత్తగూడెం జిల్లా బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో పాల్వంచ డీఎస్పీ సతీష్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శనివారం బూర్గంపాడు గ్రామ శివారు సమక్కసారక్క గద్దెల వద్ద ఎస్ఐ ఈ.రాజేశ్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో గంజాయి తరలిస్తూ వాంకుడోతు సాయికుమార్, పెదముత్యం వంశీ పట్టుపడ్డారు. అనంతరం వారిని విచారించారు. ఎస్‌కే మన్వర్, రమేష్, కే.సురేష్, జగదీష్, వీ.సాయి కుమార్, కలిసి గంజాయివ్యాపారం చేయాలనుకున్నారు. గతంలో వీరు గంజాయి వ్యాపారం నిర్వహించారు. ఈ క్రమంలో షోలాపూర్‌కు చెందిన వీ.సురేష్‌తో కలిసి గంజాయిని ఇల్లిందు క్రాస్ రోడ్డు వద్ద ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో భద్రాచలం వద్ద కారును అద్దెకు తీసుకుని మోటు అనే గ్రామానికి వెళ్ళి అక్కడ బీమా అనే వ్యక్తి వద్ద 55ప్యాకెట్ల మొత్తం బరువు 121.140 గంజాయిని కొని కుక్కునూరు మండలం వింజరం వద్ద పడవసాయంతో గోదావరి ఇవతలకు దాటారు. అనంతరం కుక్కునూరు మండలంలోని పలు గ్రామాలను ఆంధ్ర తెలంగాణ సరిహద్దులను దాటి బూర్గంపాడులో ప్రవేశించారు. పోలీసుల తనిఖీలో వారు గంజాయితో పట్టుబడ్డారు. కాగా ఈ కేసులో ప్రస్తుతం ఇద్దరుపట్టుబడగా మరికొందరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.



రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

న్యాయం చేయాలంటూ బంధువుల ఆందోళన.. పోస్టుమార్టం నిలిపివేత

ఏలూరు క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తమకు న్యాయం చేయాలని మృతుని బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. పెదవేగి మండలం వేగివాడలోని ఎమ్మార్పీ కాలనీకి చెందిన ఘంటా భరత్ కుమార్ (22) ఒక ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంటుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 21వ తేదీన భీమడోలు రైల్వే గేటు సమీపంలో జాతీయ రహదారిపై అకస్మాత్తుగా భరత్ కుమార్ కుడివైపు తిరగడంతో అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఒక కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన అతనిని ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే కారు యజమాని నష్టపరిహారం కట్టాలని అప్పటి వరకు మృత దేహాన్ని పోస్టుమార్టం చేయనివ్వమంటూ, కారు యజమాని రావాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి ముందు రోడ్డుపై శనివారం మధ్యాహ్నం కొద్దిసేపు ఆందోళన చేసి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారు. టూటౌన్ పోలీసులు వారిని అక్కడ నుంచి పంపించి వేశారు. అయితే న్యాయం జరిగే వరకూ పోస్టుమార్టం జరిగే వరకూ వీలు లేదని డిమాండ్ చేశారు. అయితే పోస్టుమార్టం చేసే సమయం అయిపోయిందని వైద్యులు వెళ్ళిపోయారు. ప్రస్తుతం మృత దేహం ఆసుపత్రి మార్చురీలో ఉంది.

హంతకులకు శిక్షపడేలా కష్టపడ్డారు

అభినందించి ప్రశంసాపత్రాలు అందించిన ఎస్పీ



ఎస్పీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర

ఏలూరు క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ జంటపై దాడిచేసి యువతిపై అత్యాచారం, ఆపై హత్య చేసి ప్రేమికుడి పై హత్యాయత్నానికి పాల్పడిన నలుగురికి జీవిత ఖైదు పడే విధంగా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ కేపీఎస్ కిషోర్ ప్రశంసించి, ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలను అందించారు. 2019 ఫిబ్రవరి 24న కామవరపుకోట మండలం జీలకర్రగూడెం (బౌద్ధారామాల కొండ) గట్టుపైకి వెళ్ళిన ప్రేమ జంటపై నలుగురు జంతువేటగాళ్ళు దాడిచేసి, బెదిరించి యువతిపై అత్యాచారం చేసి హత్య చేశారు. ఈ కేసు నమోదు చేసిన తడికలపూడి పోలీసులు నలుగురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ కేసు ఏలూరులోని పోక్సో కోర్టులో విచారణ సాగింది. ఆ నలుగురికి శుక్రవారం జీవితఖైదు విధించారు. కేసు దర్యాప్తులో సాక్ష్యులను సకాలంలో హాజరు పర్చడంలో విశేష కృషి చేసి పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రశంసించారు. ఈ సందర్భంగా అప్పటి చింతలపూడి సీఐ యుజె విల్సన్, పి.రాజేష్, ప్రస్తుతం జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, జంగారెడ్డిగూడెం సీఐ బి.కృష్ణబాబు, తడికలపూడి ఎస్ఐ చెన్నారావు, టి నర్సాపురం ఎస్ఐ జయబాబు, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఎం.సుబ్బారావు, తడికలపూడి కానిస్టేబుల్ కేవీవీఎస్ కొండలరావు, కోర్టు మానిటరింగ్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, మహిళా హెడ్‌కానిస్టేబుల్ ఎం వెంకట రమణ, కానిస్టేబుల్ పి.రవికుమార్‌లకు ప్రశంసాపత్రాలను ఎస్పీ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, ఎఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీలు డి శ్రావణ్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, యు.రవిచంద్ర, ప్రసాదరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ హబీబ్ బాషా, ఎస్ఐ రాజారెడ్డి, ఐటీ కోర్ ఇన్‌చార్జి నరేంద్ర పాల్గొన్నారు.



విచారణ నిర్వహిస్తున్న డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్

కూలీ ఆత్మహత్య

పెదపాడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : యజమాని మందలించడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందినట్లుగా పెదపాడు ఎస్ఐ కట్టా శారద సతీశ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం పెదపాడు మండలం వెంకటాపురానికి చెందిన మిండాల సాయి (28) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య మాధవి, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు. సాయి పనిచేసే చోట యజమాని మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంటిలో శుక్రవారం ఉరి వేసుకుని మృతి చెంది నట్లుగా మృతుని తమ్ముడు శ్రీను పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న పెదపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి శనివారం తరలించారు. డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, సీఐ కె.వెంకటేశ్వరరావు మృతుని బంధువులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

మొగల్తూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య వర్షిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో మొగల్తూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు ట్రస్ట్ చైర్మన్ నాగిడి రాంబాబు తెలిపారు. గుండె, ఊపిరితిత్తులు, వెరికోస్ వెయిన్స్, జనరల్ చెకప్, నరాల బలహీనత, ఈఎన్‌టీ, డెంటల్, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు.

పీ4 సర్వేతో పేదలకు లబ్ధి

ఆకివీడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పీ4 సర్వే వల్ల అర్హుల పథకాలు తొలగించరని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ అన్నారు. శనివారం స్థానిక మాదివాడ కల్యాణ మందిరంలో పేదరిక నిర్మూలన సర్వేపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సర్వే వల్ల పథకాలను తొలగిస్తారని కొందరు పుకార్లు సృష్టిస్తున్నారని వాటిని నమ్మవద్దన్నారు. నిబంధనల మేరకు సర్వే చేసి అనర్హులను తొలగించి, అర్హులకు లబ్ధి చేకూరుతుందన్నారు.



మానవ మనుగడకు జలమే ఆధారం

పాలకొల్లు అర్బన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నీరు లేనిదే సృష్టిలో ఏ జీవి మనుగడ సాగించలేదని ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ అన్నారు. శనివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి నీటి ఆవశ్యకతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీటి వృథాను అరికట్టాలని, నీటిని కాలుష్యం బారిన పడకుండా సంరక్షించే విధానాలపై అవగాహన కల్పించాలని నినాదాలిచ్చారు. మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆర్ భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

శాలివాహనుడి సేవలు మరువలేనివి

తణుకు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శాలివాహనుడి సేవలు మరువలేనివని పలువురు నాయకులు అన్నారు. శనివారం శాలివాహనుడి జయంతి సందర్భంగా సొసైటీ రోడ్డులోని పార్కు వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాలివాహన సంఘ నాయకులు చుంచుల వెంకటేశ్వరరావు, తాతపూడి మారుతీరావు, చింతన్న, శివప్రసాదు తదితరలు పాల్గొన్నారు.

విద్యార్థినులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలి

పాలకొల్లు అర్బన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ తోటి మహిళలను ప్రోత్సహించాలని నరసాపురం పట్టణ ఎస్ఐ జయలక్ష్మి అన్నారు. శనివారం ప్రిన్సిపాల్ డాక్టర్ పి. శోభారాణి అధ్యక్షతన జరిగిన డీఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఫేస్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాంల వల్ల ఏర్పడే అనర్థాలను వివరించి విద్యార్థినులు వాటికి దూరంగా ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి రవి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


చింతలపాటి హరిని సన్మానిస్తున్న దృశ్యం

తణుకు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): డిజిటల్ కాలంలో సాంకేతికత ముఖ్య పాత్ర పోషిస్తుందని బెంగళూరుకు చెందిన సైబర్ క్రైం నిపుణులు చింతపాటి హరి అన్నారు. శనివారం రూట్స్ స్కూలు ఆఫ్ ఎసెన్షియల్ ప్యాకల్టీస్ ఆధ్వర్యంలో తణుకు రోటరీ క్లబ్‌లో యువతకు, తల్లిదండ్రులకు ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ ద్వారా సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ ఎల్.కె.త్రిపాఠి, తపట్టణ ఎస్ఐ కె.శ్రీనివాసరావు ప్రసంగించారు. అనంతరం హరిని సన్మానించారు. సంస్థ డైరెక్టర్లు బి.విద్యాకాంత్, ఎన్.సుధాకర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన న్యాయాధికారి

తణుకు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రిమాండ్ ఖైదీలకు ఆర్థిక స్థోమత లేకపోతే మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఏలూరు సెక్రటరీ కె.రత్నప్రసాద్ అన్నారు. శనివారం తణుకు సబ్ జైలును ఆకస్మికంగా సందర్శించారు. నాల్గో అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి, న్యాయాధికారులు కె.సత్యకృష్ణలత, శ్రీసాయిరాం పొతర్లంక, బార్ అధ్యక్షుడు కామేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నరసాపురంలో...

నరసాపురం టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ జైలును శనివారం జిల్లా న్యాయమూర్తి సునీల్‌కుమార్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఖైదీలకు వండిన పదార్థాలను రుచి చూశారు. రిమాండ్‌కు దారి తీసిన పరిస్థితుల్ని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ ఖైదీలు ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చున్నారు. న్యాయాధికారులు రత్నప్రసాద్, విజయదుర్గా, గంగరాజు, వరలక్ష్మి, కె శ్రీనివాస్, సబ్‌జైలర్ అప్పారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సమస్యలను అధిగమించాలి

తణుకు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సమస్యల్ని అధిగమించి ముందుకు సాగాలని ఎస్కేఎస్డీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయి అన్నారు. శనివారం కళాశాలలో సీనియర్లకు వీడ్కోలు సభ నిర్వహించారు. గైనకాలజిస్టు డాక్టర్ సి. వెంకట ఉషారాణి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాజిటివ్ దృక్పథం అలవర్చుకోవాలన్నారు. కళాశాల సెక్రటరీ చిట్టూరి సత్య ఉషారాణి, చిట్టూరి రీనాసాయి ప్రసంగించగా ట్రెజరర్ నందిగం సుధాకర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలి

భీమవరం అర్బన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని తొలగిస్తున్న చిరువ్యాపారులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. జిల్లాలో అనేక చోట్ల తోపుడు బండ్లపై చిరువ్యాపారం చేసుకునే వారిని అధికారులు ఏ ఆధారం చూపకుండా తొలగిస్తున్నారని, ఎక్కడైతే తొలగించారో అక్కడ వారికి ప్రత్యామ్నాయం చూపాలన్నారు.

సివిల్ ఇంజనీర్లు ప్రగతికి తోడ్పడాలి : రఘురామ



భీమవరం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సివిల్ ఇంజనీర్లు ఏఐ, నూతన టెక్నాలజీని ఉపయోగించి దేశ నవనిర్మాణ ప్రగతికి కృషి చేయాలని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు కోరారు. స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజులపాటు జరిగిన శిక్షణ శనివారం ముగిసింది. ఆర్ అండ్ డి డీన్ డాక్టర్ పి.వంశీనాగరాజు అధ్యక్షత వహించారు. న్యూఢిల్లీ నుంచి వచ్చిన చీఫ్ సైంటిస్ట్ అండ్ ప్రాజెక్ట్ లీడర్ డాక్టర్ పిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ జియోసింథటిక్స్ రోడ్ల నిర్మాణంలో టెక్నికల్ టెక్స్‌టైల్ వంటి వాటిని ఉపయోగించటం వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న సివిల్ ఇంజనీర్లకు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందించారు.

మహిళలు సుస్థిర జీవనోపాధి పొందాలి

కాళ్ళ: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న పథకాలను సద్వినియోగపరచుకుని సుస్థిరమైన జీవనోపాధి పొందాలని రఘురామకృష్ణంరాజు అన్నారు. పెద అమిరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం పీఎంఏజేఏవై ద్వారా నియోజకవర్గంలోని 12 మంది లబ్ధిదారులకు రూ. 17 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ, వెలుగు పీడీ వేణుగోపాల్, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

ఆకివీడులో దాతలకు కొదవలేదు

ఆకివీడు: ఆకివీడులో దాతలకు కొదవలేదని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. పల్స్ ఆస్పత్రి అధినేత డాక్టర్ బిలాల్ ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన శనివారం ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు ఉచితంగా వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీరు అందించడం శుభపరిణామన్నారు. అనంతరం స్థానిక షాదీఖానాలో చేపల వర్తకుడు ఆతీఫ్, డాక్టర్ బిలాల్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రఘురామ, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి నియామకం ఎప్పుడో..?

ఆచంట నియోజకవర్గ జనసైనికుల ఎదురుచూపు

ఆచంట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జనసేన ఏర్పడిన నాటి నుంచి ఆచంట నియోజకవర్గానికి పార్టీ ఇన్‌చార్జి ఉండేవారు. దాంతో నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలు ఇన్‌చార్జి ద్వారానే జరుగుతుండేవి. ఆచంట ఇన్‌చార్జిగా పాలకొల్లుకు చెందిన చేగొండి సూర్య ప్రకాష్ ఇన్‌చార్జిగా ఉండేవారు. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల ముందు ఆయన పార్టీకి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. నాటి నుంచి నేటి వరకు జనసేన పార్టీ ఇన్‌చార్జిని నియమించలేదు. ప్రస్తుతానికి నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధ్యక్షులు ఉన్నారు. వీరే ఆయా మండలాల్లోని పార్టీ కార్యక్రమాలు వీరి ద్వారానే జరుగుతున్నాయి. నియోజకవర్గానికి వెంటనే ఇన్‌చార్జిని నియమిస్తే పార్టీ మరింత ముందుకు వెళ్లడంతోపాటు కార్యకర్తలు కూడా అన్నివిధాలా న్యాయం జరుగుతుందని పార్టీ శ్రేణులు సూచిస్తున్నాయి.


శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న విప్ నాయకర్

ప్రొటోకాల్ తెలియదా?

అధికారులపై విప్ నాయకర్ ఆగ్రహం

నరసాపురం రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రొటోకాల్ తెలియదా? శిలాఫలకంపై ముందు ఎవరి ఫొటో ఉండాలి అంటూ విప్ బొమ్మిడి నాయకర్ శనివారం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నరసాపురం మండలం చామకూరిపాలెంలో రూ. 20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు నాయకర్ వెళ్లారు. ముందుగా కొబ్బరికొట్టి శిలాఫలకం వద్దకు వచ్చారు. ముందుగా కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, ఆ తరువాత సీఎం చంద్రబాబు, తర్వాత డిప్యూటీ సీఎం పవన్ ఫొటోలున్నాయి. వెంటనే అధికారుల్ని పిలిచి ప్రొటోకాల్ కరెక్ట్‌గా ఉందా అని ప్రశ్నించారు. ముందు సీఎం ఫొటో ఉంటుందా? లేక కేంద్ర సహాయ మంత్రి ఫొటో ఉంటుందా? కనీసం ప్రొటోకాల్ చూడకుండా ఎలా ఏర్పాటు చేశారంటూ నిలదీశారు. మరోసారి ఈ విధమైన తప్పిదం జరిగితే ఊరుకునేది లేదంటూ హెచ్చరించారు.

అభివృద్ధికి పెద్దపీట...

నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్దపీట వేస్తానని, మౌలిక వసతుల్ని మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, దానికి అనుగుణంగా తాగునీటి ప్రాజెక్టులు, రహదార్లు, పంట రోడ్లను దశల వారీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీడీవో రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.


ట్యాంక్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

పనులు వేగవంతం కావాలి: బొలిశెట్టి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కుంచనపల్లిలో రెండో సమ్మర్ స్టోరేజ్ పనులు వేగంగా చేపట్టాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అధికారులకు సూచించారు. కుంచనపల్లి కడియపు చెరువు ప్రాంతాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. పనులు వేగంగా చేయాలని వర్షాకాలం వస్తే పనులకు అడ్డంకిగా మారుతుందన్నారు. అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రేపు విపత్తుల నివారణపై సమావేశం

మొగల్తూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై ఈ నెల 24న మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ శనివారం తెలిపారు. 25న పేరుపాలెం సౌత్‌లో ఆర్డీవో పర్యవేక్షణలో ఎస్ఆర్ఎఫ్ సభ్యులతో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నామని విధిగా అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన కోరారు.

కాలుష్య నివారణకు చేపట్టిన చర్యలేమిటి?

న్యాయమూర్తి డాక్టర్ బి. లక్ష్మీనారాయణ

భీమవరం క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నివారణకు ఈ నెల రోజుల్లో తీసుకున్న చర్యలపై పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి. లక్ష్మీనారాయణ ఆరా తీశారు. భీమవరం డీఎన్నార్ కాలేజీ రోడ్డు గుండా ప్రవహిస్తున్న పంట కాలువ కాలుష్యాన్ని నివారించడానికి తీసుకోవలసిన చర్యలపై ఫిబ్రవరి 22న మునిసిపల్, ఇరిగేషన్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన కొన్ని సూచనలు చేశారు. అవగాహన ర్యాలీలు నిర్వహించడం, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం తదితర చర్యలు చేపట్టినట్టు అధికారులు న్యాయమూర్తి దృష్టికి తీసుకువచ్చారు. చెత్తను పంట కాలువలో వేస్తున్న వారిని గుర్తించి పెనాల్టీలు వేయడం, ఆ వచ్చిన పెనాల్టీలు కాలుష్య నివారణకు అవగాహన కల్పించేందుకు వాడితే ప్రయోజనం ఉంటుందని అభిప్రాయపడ్డారు. తదుపరి జరిగే సమీక్షా సమావేశానికల్లా మెరుగైన ఫలితాలను సాధించి పంట కాలువ నీరు కాలుష్యాన్ని నివారించి తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా పంచాయతీ అధికారి బి.అమ్మశ్రీ, మునిసిపల్ అసిస్టెంట్ కమీషనర్ సిహెచ్.వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తా: మంత్రి

పాలకొల్లు అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామయ్య హాలు వద్ద జి ప్లస్ గృహాలకు పూర్తిగా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి రామానాయుడు హామీ ఇచ్చారు. శనివారం పట్టణంలో మంత్రి ఆయన విస్తృతంగా పర్యటించారు. రూరల్ పంచాయతీ పరిధిలోని పెదగరువులో పర్యటించి ఈ పంచాయతీని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మదర్ థెరిస్సాల స్ఫూర్తితో తన తండ్రి ధర్మారావు పేరుతో ధర్మారావు ఫౌండేషన్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు. గత ప్రభుత్వంలో అన్ని వ్యవస్థలు భ్రష్టు పట్టిపోయాయన్నారు. పెద గరువులో అంబేడ్కర్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ ప్రాంతాల్లో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్సీ అంగర, ఆర్డీవో దాసి రాజు, తహసీల్దార్ వై దుర్గా కిషోర్, కమిషనర్ విజయ సారథి కూటమి నాయకులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి మంత్రి నిమ్మల నివాళి


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే పితాని

పేదల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

పోడూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. కొమ్ము చిక్కాల క్యాంపు కార్యాలయంలో శనివారం అత్యవసర చికిత్స చేయించుకున్న 20 మందికి రూ.17.42లక్షలు సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గణపతినీడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ: శాసన సభ ప్రివిలైజేషన్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యే పితానిని ఆయన నివాసంలో పెనుగొండ, వడలి గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా వడలికి చెందిన అంగర హేమంత్ వెంకట కుమార్‌కు రూ. 1,31,867 , గుర్రం సత్యనారాయణకు రూ. 35,700లు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందించారు. నక్కా వేద వ్యాస శాస్త్రి, మద్దింశెట్టి వెంకటేష్, కటికిరెడ్డి నానాజీ, రొక్కాల సురేష్, వేంద్ర రాము పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ప్రగతి పథంలో రాష్ట్రం : పత్సమట్ల

గణపవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 9 నెలల్లో అన్ని వ్యవస్థలను పటిష్టపరుస్తూ ప్రగతి పథం వైపు పయనిస్తోందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం కాశిపాడులో సీసీ రహదారిని ఆయన ప్రారంభించారు. ముగ్గళ్ళ గ్రామంలో రూ.48 లక్షల 58 వేల వ్యయంతో నిర్మించనున్న ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను పట్టించుకోకుండా నిర్వీర్యం చేసిందన్నారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్లు ఇందుకూరి రామకృష్ణంరాజు, పొత్తూరి వాసురాజు, జడ్పీటీసీ సోమాలక్ష్మి, ఎంపీటీసీ రమేష్‌రాజు, సర్పంచ్‌లు తెర్లి నాగరాజు, విమల, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, జనసేన మండల అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఎడ్యు ఎక్స్‌పో

భీమవరంటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : యువతలో దాగిన నైపుణ్యాన్ని వెలికి తీయడానికి సైన్సు ఎగ్జిబిషన్లు దోహదపడతాయని యూబీఐ చీఫ్ మేనేజర్ నిర్మల జ్యోతి అన్నారు. భీమవరం త్యాగరాజ భవనంలో సర్ సివి రామన్ స్కూల్ ఏర్పాటు చేసిన ఎడ్యు ఎక్స్ పో శనివారం ముగిసింది. నిర్మల జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధనకు పట్టుదలతో కృషి చేయాలన్నారు. 140 మంది విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారని, 41 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారని, వారికి బహుమతులు అందజేశామని ప్రిన్సిపాల్ తెలిపారు.

వేధింపుల కేసులో నిందితుడి అరెస్ట్

భీమవరం క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఒక మహిళను లైంగికంగా వేధిస్తున్న కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ ఎం.నాగరాజు తెలిపారు. పట్టణానికి చెందిన ఒక మహిళను పులపర్తి అప్పలస్వామి అనే వ్యక్తి వేధించడంతో ఆ మహిళ వన్‌టౌన్ పోలీసులకు ఈ నెల 20వ తేదీన ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్ట్‌చేసి సెకండ్ ఏజెఎఫ్‌సిఎం కోర్టులో హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

అక్రమ చెరువుల్ని రద్దు చేయాలి

భీమవరం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తవ్వుతున్న ఆక్వా చెరువులను వెంటనే రద్దు చేయాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. పెదగరువులో దళితుల ఇళ్ళకు ఆనుకుని అక్రమంగా తవ్వుతున్న ఆక్వా చెరువులను శనివారం కెవీపీఎస్ బృందం పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. తక్షణం అక్రమ ఆక్వా చెరువు తవ్వడాన్ని రద్దు చేయాలని లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. సీఐటియూ నాయకులు ఇంజేటి శ్రీనివాస్, స్థానికులు పాలపర్తి జ్ఞానరాజు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి వర్మ

మధుసూదన్‌రాజుకు మంత్రి నివాళి

పాలకోడేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా అందరితో స్నేహంగా మెలిగే కుముదవల్లి గ్రామ టీడీపీ అధ్యక్షుడు సాగి మధుసూదన్‌రాజు ఆకస్మిక మృతి బాధాకరమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. శనివారం కుముదవల్లిలోని మధుసూదన్‌రాజు నివాసానికి వెళ్ళి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సర్పంచ్ భూపతిరాజు వంశీకృష్ణంరాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు కలిదిండి వినోద్‌వర్మ, కలిదిండి పవన్, నీటి సంఘం చైర్మన్ మురళీరాజు, భూపతిరాజు రమేష్‌రాజు తదితరులు నివాళులర్పించారు.

'ఉపాధి'కి నిధులు కేటాయించాలి

కాళ్ళ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ చట్టానికి తగినన్ని నిధులు కేటాయించి చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సీఐటియు కాళ్ళ మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ అన్నారు. పెద అమిరంలో శనివారం ఉపాధి కూలీలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగం అధికారి కూలీలతో పరుషంగా మాట్లాడటం సరికాదన్నారు. సమయానికి వేతనాలు చెల్లించాలన్నారు.

పెరిగిన మునిసిపల్ మార్కెట్ పాట

భీమవరం టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మునిసిపాల్టీలో శనివారం నిర్వహించిన మార్కెట్ వేలం పాటలో మునిసిపాల్టీకి రూ. 5 లక్షల 42 వేల ఆదాయం పెరిగింది. మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో మునిసిపల్ రెవెన్యూ అధికారులు వేలం పాటను నిర్వహించారు. పాటలో 6 గురు పాల్గొన్నారు. రూ. 55 లక్షల నుంచి వేలంపాట నిర్వహించగా యర్రంశెట్టి వెంకటేష్ రూ. 55 లక్షల 11వేలకు దక్కించుకున్నారు. వేలంపాటలో ఆర్ఓ రాఘవయ్య, ఆర్ఐలు అల్లూరి శ్రీనివాసరాజు, లక్ష్మణరావు, పాషా తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దని ఆందోళన

నరసాపురం టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నివాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వద్దని శనివారం వీవర్స్ కాలనీ వాసులు ఆందోళన చేశారు. కాలనీ వాసులు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చి ఆర్డీవో దాసిరాజును కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఆర్డీవో ఎక్సైజ్ అధికారులతో చర్చిస్తామని హామీ ఇచ్చారు. యర్రా శ్రీను, మావూరి ఆనంద్, కోటి, రాజు, సూర్యకుమార్, స్వామి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రుణాల దరఖాస్తుకు గడువు పెంపు

అత్తిలి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వివిధ కార్పొరేషన్ల కింద స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తులు స్వీకరణ తేదీని 22 నుంచి 25 వరకు గడువు పొడిగించినట్లు ఎంపీడీవో పి శామ్యూల్ తెలిపారు. కాపు కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాల కోసం నమోదు చేసుకొనే వయోపరిమితిని 50 నుంచి 60 సంవత్సరాల వరకు పెంచినట్లు తెలిపారు.

రోడ్ల నాణ్యత పరిశీలన

పెనుగొండ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చినమల్లం గ్రామంలో ఎమ్మెల్యే పితాని విడుదల చేసిన రూ. 50 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రహదారి పనులను అధికారులు తనిఖీ చేశారు.

పంచాయతీ రాజ్ క్వాలిటీ కంట్రోల్ అండ్ విజిలెన్స్ ఈఈ అశోక్, డీఈ కృష్ణమూర్తి, ఏఈ పవన్‌లతో కలిసి పరిశీలించి ఏ విధంగా నాణ్యతా ప్రమాణాలు పాటించారని తెలుసుకున్నారు.

ఆక్రమణల అడ్డగింత

ఆకివీడు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అమృతరావునగర్ కాలనీలో ఏర్పాటు చేసుకున్న గుడారాలను తొలగించడానికి వెళ్ళిన అధికారులను ఆక్రమణదారులు అడ్డుకున్నారు. పోలీసుల సహకారంతో నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్, మేనేజర్ వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాకేత్‌తో పాటు శానిటేషన్ కార్మికులు సుమారు 50 మందితో కలిసి ఆక్రమణలు తొలగించేందుకు శనివారం వెళ్ళగా అడ్డుకున్నారు. తాళ్ళకోడులో స్థలాలు ఇచ్చినా తాము నిర్మించుకొనే స్థోమత లేదని, ప్ర భుత్వం నిర్మాణం చేస్తే వెళ్ళిపోతామన్నారు. ఆక్రమణదారులు తమను చంపి ఖాళీ చేయాలంటూ ఆందోళనకు దిగడంతో అధికారులు వెనక్కి వెళ్ళిపోయారు. భారీ పోలీసు బందోబస్తుతో వచ్చి ఖాళీ చేయిస్తామని కమీషనర్ అన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ కె నరసింహమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హౌసింగ్ బోర్డు, శశి కళాశాల, ఎస్ఎస్ రాజు లేఅవుట్ ఏరియా, పాలిటెక్నిక్ కళాశాల, గాంధీ బొమ్మసెంటర్, గణేష్‌నగర్, ప్రభుత్వ ఆసుపత్రి ఏరియా, సత్యవతి నగర్, ఎఫ్‌సీఐ కాలనీ, అబ్బులు కొట్టు సెంటర్ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. అలాగే జువ్వలపాలెం సబ్‌స్టేషన్ మెయింటెనెన్స్ నిమిత్తం జువ్వలపాలెం, సవిత్రుపేట, తణుకు బైపాస్ రోడ్డు, మార్కెట్ ఏరియా, కొత్తగూడెం, నవ్వారుపేట, ఏలూరు రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

●ఆకివీడు: సబ్ స్టేషన్ పరిధిలో 33/11కేవీ పనులు నిర్వహణ, 11 కేవీ ఫీడర్స్ పనులు నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరా ఉండదని భీమవరం ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. అజ్జమూరు ఫీడర్స్, 11కేవీ ఫీడర్స్‌లలో సరఫరా ఉండదన్నారు.

వేలంతో పెరిగిన ఆదాయం

ఆకివీడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆశీలు పాడుకున్న వారు రెండు వాయిదాలు చెల్లించకుంటే తిరిగి బహిరంగ వేలం నిర్వహిస్తామని కమిషనర్ జి.కృష్ణమోహన్ అన్నారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. రోజువారి సంత మోటుపల్లి శ్రీకాంత్ రూ.1,01,01,006లకు, వారపు సంత షేక్ అమీర్ రూ. 3,30,200లు, కబేళా షేక్ చంటిసాహెబ్ రూ.35,500లకు పాడుకున్నారు. ఈ మూడు పాటలకు సంబంధించి నగర పంచాయతీకి ఈ ఏడాది రూ.20,31,706లు ఆదాయం పెరిగింది. మేనేజర్ వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాకేత్ తదితరులు ఉన్నారు.

వర్గీకరణ హామీని నిలబెట్టుకున్న సీఎం

తణుకు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు చట్టం చేయడాన్ని స్వాగతిస్తున్నట్టు టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లాజర్ అబ్బదాసరి అన్నారు. శనివారం తణుకులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వర్గీకరణపై ఇచ్చిన హామీకి కట్టుబడిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. వర్గీకరణ విష యంలో జగన్ కనీసం మాట్లాడకపోవడం బాధాకర మన్నారు. పలువురు ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించండి

పాలకోడేరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీపీ సత్యనారాయణరాజు కోరారు. పాలకోడేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ భూపతిరాజు సత్యనారాయణరాజు అధ్యక్షతన శనివారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆర్థిక సాయంతో ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. ఎమ్మార్వో విజయలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ నిధులతో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చాలన్నారు. ఎంపీడీవో రెడ్డియ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

'బెల్టు షాపులు అరికట్టాలి'

భీమవరం అర్బన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అక్రమ మద్యం బెల్టుషాపులను అరికట్టలేకపోతోందని గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి ఆరోపించారు. శనివారం సీఐటీయు కార్యాలయంలో కల్లు గీత సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాటి కల్లు అమ్మకాలను దెబ్బ తీస్తున్న బెల్ట్ షాపులను అరికట్టి గీత కార్మిక కుటుంబాలను ఆదుకోవాలన్నారు. తాటి చెట్టుకు రూ. 10 చొప్పున కిస్తీలు కట్టించుకొని చెట్టుపై హక్కు కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి, సభ్యులు పాల్గొన్నారు.

త్వరలో కంట్రోలర్ నియామకం


మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న సురేష్

ఆకివీడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొత్త బస్టాండ్ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టామని భీమవరం డిపో అసిస్టెంట్ మేనేజర్ సురేష్ అన్నారు. శనివారం ఆయన బస్టాండ్‌ను పరిశీలించి మాట్లాడారు. కంట్రోలర్‌ను వెంటనే నియమిస్తామని, తాగునీటి సదుపాయం కూడా ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. మరుగుదొడ్లు తలుపులు బాగు చేయించామన్నారు. ఈయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి పాదాలు తాకిన సూర్యకిరణాలు

భీమవరంటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : జెపి రోడ్డులోని పద్మావతి వేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో శనివారం స్వామివారి పాదాలను సూర్యకిరణాలు తాకాయి. స్వామివారికి విశేష అలంకారం చేశామని ఈవో సత్యనారాయణరాజు తెలిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి ఆదినారాయణాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


వరాల వెంకన్నకు పూజలు

అత్తిలి: ఈడూరు వరాల వేంకటేశ్వరస్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, తోమాలసేవ, విశేష అర్చనలు జరిపారు. భక్తులకు దేవాలయ కమిటీ సహకారంతో అన్నదానం జరిపారు. అత్తిలి రైల్వే స్టేషన్ రోడ్డులో గల బాలాజీ వేంకటేశ్వరస్వామిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

ఆధ్యాత్మికం

బాలా త్రిపుర సుందరికి పూజలు

భీమవరం టౌన్: మెంటేవారి తోట శ్రీ విజయ కనకదుర్గ శ్రీ చక్రం సహిత బాలా త్రిపుర సుందరి అమ్మవారి ఆల యంలో శనివారం మూలా నక్షత్రం పురస్కరిం చుకొని అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. వాసంశెట్టి చంద్రశేఖర్ దంపతులచే అమ్మవారికి లలిత సహస్రనామ కుంకుమార్చన నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు.



గ్రామ దేవతలకు ప్రముఖుల పూజలు

ఆకివీడు రూరల్: అయిభీమవరం గ్రామదేవతలైన పోలేరమ్మ, వీర్ల వెంకమ్మ జాతర సందర్భంగా శనివారం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుమూరు అబ్బాయిరాజు, గొట్టుముక్కల సత్యనారాయణరాజు, కనుమూరు రామకృష్ణరాజు, కంతేటి రామరాజు పాల్గొన్నారు.